అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీటీసీ బసిరెడ్డి



ర్యాలీలో వాహన చోదకులు

చిత్తూరు రూరల్: వాహనాలు నడిపేవారు అప్రమత్తంగా, ఏకాగ్రతగా ఉండాలని, తనపై కుటుంబం ఆధారపడి ఉందనే విషయాన్ని మరువకూడదని, అప్పుడే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతోందని డీటీసీ బసిరెడ్డి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం చిత్తూరు నగరంలో రోడ్డుభద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెండా ఊపి ఆయన ర్యాలీని ప్రారంభించారు. డీటీసీ నుంచి గిరింపేట మీదుగా కలెక్టర్ బంగ్లా వరకు వాహనాల ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండి నడపంలో మెలకువలు అవసరమన్నారు. నిద్ర, మద్యం మత్తుల్లో వాహనాలు నడపకూడదని తెలిపారు. వాహన నడిపేవారు వెంటే అన్ని అర్హత పత్రాలు ఉంచుకోవాలని, రవాణాశాఖాధికారులు అడిగనప్పుడు చూపకుంటే అపరాధ రుసుం వేస్తారని పేర్కొన్నారు. వాహనం నడిపే వ్యక్తికి లైసెన్స్ తప్పనిసరని చెప్పారు. ద్విచక్ర వాహన దారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనాదరులు అధికంగా ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. అతివేగం పనికిరాదన్నారు. ఎంవీఐలు రాజేశ్వరరావు, వాసుదేవరెడ్డి, శ్వేత, మధుసూదన్, మురళి, శివారెడ్డి, శివకుమార్, గాయత్రి, భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వన్ డిపోలో అవగాహన

చిత్తూరు వన్‌డిపోలో మంగళవారం 34వ రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహించారు. కార్మికులకు ఎంవీఐ వాసుదేవరెడ్డి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని, దీనిపై డ్రైవర్లు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో డిపో అధికారులు, ఎంవీఐ శివకుమార్, భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమం



బంగారుపాళెం: కీరమందలో పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బాబు

• ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: రాష్ట్రంలో పార్టీలకతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని కీరమంద సచివాలయ పరిధిలోని గౌరీనారాయణపురం ఎస్టీ కాలనీ, వేపనపల్లె, దళితవాడలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను అందజేశారు. ఎస్టీ కాలనీలో వీధిలైట్లు, సిమెంటు రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇళ్లపై 11 కేవీ కరెంటు తీగలు తొలగించాలన్నారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. పార్టీలు, కుల, మతాలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. అనంతరం ఆయన గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో చదువుతున్న బాలికలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ రాజా, ఎంపీటీసీ సభ్యుడు రవీంద్ర, ఏఎంసీ చైర్మన్ సోమశేఖర్, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి రఘుపతిరాజు, సేవాదళ్ మండల అధ్యక్షుడు కిషోర్ కుమార్‌రెడ్డి, మైనారిటీ సెల్, యూత్ మండల అధ్యక్షుడు హిదాయత్, జగదీష్, ప్రభునాయుడు, మహేంద్ర, మండల విప్ హేమచంద్ర, శ్రీహరి, సుబ్రమణ్యం, కుట్టి, ఎంపీడీఓ హరిప్రసాద్, తహసీల్దార్ బెన్నురాజ్ పాల్గొన్నారు.

నేడు మహాసముద్రంలో...

మండలంలోని మహాసముద్రం సచివాలయం పరిధిలో బుధవారం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పర్యటించనున్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్ తెలిపారు. గడప గడపకు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు, సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



జగనన్న కాలనీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, పనులు చేయకుండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని లబ్ధిదారులను ఎంపీడీఓ గౌరి ఆరా తీశారు. మంగళవారం మండలంలోని పక్కాల గుట్ట గ్రామంలోని జగనన్న కాలనీని ఎంపీడీఓ పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ నిర్మలాదేవి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ బుజ్జిరెడ్డి

ఐరాల: ఎంపీడీఓ కార్యాలయంలో పీఆర్‌టీయూ మండల శాఖ 2023 క్యాలెండర్‌ను ఎంపీడీఓ నిర్మలాదేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు హేమచంద్రారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మధు, పార్టీ నేతలు ధనచంద్రారెడ్డి, సురేంద్రయాదవ్, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేపనపల్లెలో ఓంశక్తి పూజలు



అంబళ్లను సమర్పించేందుకు వెళుతున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని వేపనపల్లెలో మంగళవారం ఓంశక్తి అమ్మవారికి భక్తులు ఘనంగా పూజలు చేశారు. అమ్మవారి మాల ధరించిన భక్తులు గ్రామంలో ప్రదర్శనగా వెళ్లి, అమ్మవారికి అంబళ్లు పోశారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ గ్రామంలో 400 మంది భక్తులు ఇరుముడులు ధరించి, గురువారం అమ్మవారిని దర్శించుకునేందుకు మేల్‌మరవత్తూరుకు బయలుదేరి వెళుతున్నట్లు తెలిపారు.

108లో ప్రసవం



గంగాధరనెల్లూరు: మండలంలోని లక్ష్మిరెడ్డిపల్లెకు చెందిన సోనియా మంగళవారం 108 అంబులెన్స్‌లో ఆడ పిల్లకు జన్మనిచ్చింది. వివరాలిలా.. పురిటి నొప్పులు మొదలయిన వెంటనే కుటుంబసభ్యులు 108కి ఫోన్‌లో సమాచారం అందించారు. అంబులెన్స్ గ్రామానికి వెళ్లి గర్భిణి సోనియాను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్నారు. జీడీనెల్లూరు సమీపంలోనే ఆమెకు పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. అంబులెన్స్ సిబ్బంది ఈఎన్‌టీ అనసూయ, పైలెట్ రసూల్ వాహనాన్ని పక్కన ఆపి, సురక్షితంగా ప్రసవం చేశారు. అనంతరం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు.

మెరిట్ టెస్ట్‌కు నగరి విద్యార్థులు

నగరి : మున్సిపల్ పరిధి పుదుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 14 మంది విద్యార్థులు సైన్స్ ఉపాధ్యాయురాలి పర్యవేక్షణలో ఎడ్యుకేషనల్ ఎంపిసెన్సీ మెరిట్ టెస్ట్‌కు హాజరయ్యారు. ఆన్‌లైన్‌లో సెల్‌ఫోన్ వినియోగంతో ఈ పరీక్ష నిర్వహించారు. పరీక్ష నిర్వహణను ఎంఈఓ శ్రీదేవి తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడం కోసం ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుతం ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఇందులో 50 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ఈనెల 31వ తేదీన నిర్వహించే మెయిన్స్‌కు హాజరవుతారన్నారు. 7, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించే ఈ పరీక్షల్లో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వచ్చిన వారికి 10వ తరగతి విద్యార్థులైతే బహుమతుల కింద రూ.8వేలు, 6వేలు, నాలుగు వేలు అందిస్తారన్నారు. 7వ తరగతి విద్యార్థులైతే రూ.5 వేలు, 4 వేలు, మూడు వేలు అందిస్తారన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం



గంగాధరనెల్లూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. మండలంలోని ఎల్లమరాజుపల్లె సమీపంలోని కనికలమ్మగుట్ట జగనన్న కాలనీలో నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఉగాది నాటికి గృహ పవేశం చేసే విధంగా లబ్ధిదారులు పనులు పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే బిల్లులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈఓపీఆర్డీ శివయ్య పాల్గొన్నారు.

వినాయకుని సేవలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా



వినాయకుని సన్నిధిలో మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారిని అన్నమయ్య జిల్లా మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా మంగళవారం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం ఆయన కాణిపాకం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తనయుడు ప్రవీణ్, వైఎస్సార్ సీపీ నాయకులు రవిప్రసాద్, గోపినాథ్ పాల్గొన్నారు.

అర్ధగిరిలో..

తవణంపల్లె: మండలంలోని అర్ధగిరి వీరాంజనేయ స్వామివారిని మంగళవారం సాయంత్రం మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి, ట్రస్టు బోర్డు సభ్యులు పార్థసారథిరెడ్డి సాదర స్వాగ తం పలికారు. అనంతరం ఆయన స్వామివారి ప్ర త్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మండపంలో ఎమ్మెల్యేను శేషవస్త్రాలతో సత్కరించి, స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న స్పందన ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శ్యామలాదేవి

ఐరాల: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని స్పందన ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, జనవిజ్ఞాన వేదిక సంఘ సంస్కర్త శ్యామలాదేవి అన్నారు. మంగళవారం కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడు అధ్యక్షతన చిత్తూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బాలికల దినోత్సవం నిర్వహించారు. శ్యామలాదేవి మాట్లాడుతూ బాలికలు చట్టం ద్వారా కలిగే పరిరక్షణ, సంరక్షణ మార్గాలు, సామాజిక సవాళ్లను ఎదుర్కొనే నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు, పథకాలను సద్వినియోగించుకుని, ఉన్నత స్థాయికి చేరి, సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమశేఖర్‌నాయుడు, సురేంద్రబాబు, శాంతాదేవి, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో శ్మశాన వాటికలు

వెదురుకుప్పం: ఎస్సీ,ఎస్టీ గ్రామాలకు శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ పుల్లారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మాంబేడు సచివాలయంలో సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికల కోసం ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. వీలైనంత త్వరగా భూములను గుర్తించి కేటాయించాలన్నారు. అనంతరం మాంబేడు అంగన్ వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు కోడిగుడ్లు పంపిణీ చేశారు. పచ్చికాపల్లంలో దాతలు ఇచ్చిన కోడిగుడ్లను పిల్లల తల్లిదండ్రులకు అంగన్‌వాడీ టీచర్ ఉమకు అందజేశారు. జెడ్పీటీసీ సభుడు సుకుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ ఉపాధ్యక్షుడు రోశిరెడ్డి, డీడీఓ సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ పుల్లారెడ్డి

ఆర్‌బీకేలో విజిలెన్స్ తనిఖీలు

వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లె రైతు భరోసా కేంద్రంలో మంగళశారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తిరుపతికి చెందిన విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రవి, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. రాయితీపై ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందిస్తున్నారా లేదా అంటూ అధికారులను అడిగితెలుకున్నారు. అనంతరం గ్రామానికి సమీపంలోని రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. రైతు భరోసా కింద రైతులకు డబ్బులు జమ అవుతున్నాయా...పంటల బీమా చెల్లిస్తున్నారా లేదా...ఈ క్రాప్ నమోదు సకాలంలో చేస్తున్నారా వంటి పలు అంశాలను తెలుసుకున్నారు. కియోస్క్ యంత్రం, విత్తనం మొలక శాతం పరీక్ష కిట్లు, రాయితీ ద్వారా పురుగుల మందులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుతున్నాయా అని రైతుల అభిప్రాయాలను సేకరించారు. వ్యవసాయాధికారి వనిత, సర్పంచ్ శశికుమారి, వ్యవసాయ సహాయకులు ఈశ్వరరెడ్డి, ఆనందరెడ్డి పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ప్రణాళికతోనే బంగారు భవిష్యత్తు

వెదురుకుప్పం: ప్రణాళికాబద్ధంగా చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. మంగళవారం చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులునైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కౌటిల్య కెరీర్ గైడెన్స్ సంస్థ అధినేత ఎస్ఎస్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నత లక్ష్యంతో చదివితే ఉద్యోగావకాశాలు వాటంతట అవే వెతుక్కుంటూ వస్తాయన్నారు. ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ వెంకటేష్,అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద

విద్యార్థుల సామర్థ్యం పెంపునకు కృషి

ఐరాల: విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని కోమటిగురవయ్యగారిపల్లె, మొరంపల్లె ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. పాఠశాలల్లో పలు రికార్డులను తనిఖీ చేశారు. సంక్రాంతి సెలవులకు ముందు విద్యార్థులకు నిర్వహించిన ఎస్ఏ–1 జవాబు పత్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం మెను ప్రకారం భోజనం అందుతుందా? లేదా, రుచిగా ఉంటుందా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

జేసీని కలిసిన ఎన్‌హెచ్ పీడీ



జేసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీడీ కార్తీకరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎన్‌హెచ్ (జాతీయ రహదారుల) శాఖ పీడీ కార్తీక్ రెడ్డి మంగళవారం జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో జరుగుతున్న పలు జాతీయ రహదారుల పనుల పురోగతిపై చర్చించారు. పనులు వేగవంతం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని పీడీకి జేసీ సూచించారు.

పక్కాగా అంగన్‌వాడీ నిర్వహణ

చిత్తూరు రూరల్: అంగన్‌వాడీ కార్యకలాపాలను లోపాలు లేకుండా పక్కాగా నిర్వహించాలని సీడీపీఓ శ్యామ్‌సుగుణకుమారి తెలిపారు. చిత్తూరు మండలం నాయనిచెరువు అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. పిల్లల హాజరు, రికార్డులు, పౌష్టికాహార పంపిణీ తదితర అంశాలపై ఆరా తీశారు. పిల్లల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. నిబంధనల మేరకు పౌష్టికాహారం అందించాలన్నారు. రక్తహీనత లోపంపై గర్భిణులకు అవగాహన కల్పించి, పౌష్టికాహారం తీసుకునేలా చూడాలని కార్యకర్తకు సూచించారు.

రిపబ్లిక్ వేడుకల్లో అంబేడ్కర్ ఫొటో పెట్టాలి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో అధికారికంగా నిర్వహించే రిపబ్లిక్ డే వేడుకల్లో అంబేడ్కర్ ఫొటోను పెట్టాలని ఎస్సీ, ఎస్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వినాయకం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అంబేడ్కర్ సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

వీరయ్యచౌదరికి నివాళి

గుడిపాల: సంగం డెయిరీ మాజీ చైర్మన్ ధూళిపాళ్ల వీరయ్యచౌదరి 29వ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. 197రామాపురం వద్ద ఉన్న సంగం డెయిరీలో ప్లాంట్ మేనేజర్ ఢిల్లీబాబు ఆధ్వర్యంలో సిబ్బంది నివాళులు అర్పించారు. ఢిల్లీబా బు మాట్లాడుతూ వీరయ్యచౌదరి డెయిరీ చైర్మన్‌గా, ఆంధ్రప్రదేశ్ పాడిపరిశ్రమాభివృద్ధి సమాఖ్య చైర్మన్‌గా గ్రామాల్లో రైతుల జీవన ప్రమాణాలు పెంపొందించడంలో ఎనలేని కృషిచేశారని కొనియాడారు.

సమస్యలు పరిష్కరించాలి

బంగారుపాళెం: తమ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం నాయకులకు అంగన్‌వాడీ కార్యకర్తలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలు చెల్లించాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని, ఉద్యోగ విరమణ పొందిన కార్యకర్తలకు రూ.5 లక్షలు గ్రాట్యుటీ మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్‌వాడీ కార్యకర్తలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు వరలక్ష్మి, భారతి, కళావతి పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు



అనుప్పల్లె లేవుట్‌లో సూచనలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: అనుపల్లె జగనన్న హౌసింగ్ కాలనీలో 255 గృహాలను మార్చి 15 కల్లా పూర్తి చేసేలా పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ అధికారులు, వార్డు కార్యదర్శులను నగర కమిషనర్ జె.అరుణ ఆదేశించారు. మంగళవారం లేఔట్‌లో హౌసింగ్ అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు, మేస్త్రీలను సమన్వయం చేసుకుంటూ సకాలంలో పనులు పూర్తి చేయించాలని తెలిపారు. లబ్ధిదారులతో మాట్లాడారు.

జ్వరాలపై ఇంటింటి సర్వే

నగరంలో డెంగీ జ్వరాల కేసులు నమోదు అవుతున్న దృష్ట్యా... అన్ని వార్డుల్లో ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టాలని ప్రజారోగ్య విభాగం అధికారులను కమిషనర్ జె.అరుణ ఆదేశించారు. డెంగ్యూ కేసులు నమోదైన ఇరువారం, కట్టమంచి ప్రాంతాలను మంగళవారం ఉదయం కమిషనర్ పరిశీలించారు. కేసులు నమోదైన గృహాలను సందర్శించారు. దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, ఫ్రైడే డ్రైడే పక్కాగా చేపట్టాలని, ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయాలని, తాగునీటిని క్లోరినేషన్ చేయించాలని వార్డు కార్యదర్శులను ఆదేశించారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ పాల్గొన్నారు.

మెటీరియల్ పరిశీలన

నగరపాలక సంస్థ వాహనాల షెడ్డును కమిషనర్ తనిఖీ చేశారు. నగరంలో నీటి సరఫరా, మరమ్మతుల కోసం తెప్పించిన పైపులు, మోటార్లు, ఇతర సామాగ్రి, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. వేలానికి సిద్ధం చేసిన స్క్రాప్ వస్తువులను తనిఖీ చేశారు. నిబంధనల మేరకు ప్రక్రియను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఎంఈ ధనలక్ష్మి, డీఈ వెంకట ప్రసాద్, ఏఈ శ్రీలత పాల్గొన్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పూతలపట్టు: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌ని గెలిపించాలని ఆయన సోదరుడు రాధాకృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండలంలోని ఆకనంబట్టు, బూసిపల్లె గ్రామాల్లో పట్టభద్రులకు కరపత్రాలు అందజేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం వ్యాపారవేత్త జగదీశ్వర్‌రెడ్డిని కలిసి క్యాలెండర్, కరపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ద్వారకానాథరెడ్డి, ఎంఎస్ మణి, సాయికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం అందజేస్తున్న రాధాకృష్ణ

ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధంపై అవగాహన కల్పించాలి

చిత్తూరు అర్బన్: జాతీయ హరిత ట్రిబ్యునల్ మార్గదర్శకాలు, ప్రభుత్వ ఆదేశాలు మేరకు గురువారం నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలను పూర్తిస్థాయిలో నిషేధిస్తున్నట్లు నగర కమిషనర్ జె.అరుణ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం నగరపాలక పరిధిలో జరుగుతున్న పలు కార్యక్రమాలపై వార్డ్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల తయారీ, ఏర్పాటును నిషేధిస్తున్నట్లు చెప్పారు. ఇదే విషయాన్ని వార్డు కార్యదర్శులు, అధికారులు ఆయా వార్డు పరిధిలోని ఫ్లెక్సీల తయారీదారులకు, ప్రింటర్ల యజమానులకు, వ్యాపారస్తులకు, స్థానిక రాజకీయ నాయకులకు అవగాహన కల్పించాలన్నారు. 26వ తేదీ తర్వాత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించినా, ప్లాస్టిక్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా తొలగించడంతో పాటు, అపరాధరుసుం విధించాలన్నారు. డెంగీ కేసులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఆస్తి పన్ను వసూలు నిర్దీత లక్ష్యం మేరకు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించకూడదని నగరంలోని హోటల్స్, రెస్టారెంట్ యజమానులకు అవగాహన కల్పించారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, ఏసీపీ రామకృష్ణుడు, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారమే ధ్యేయం

వెదురుకుప్పం: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగజ్యోతి అన్నారు. మంగళవారం వెదురుకుప్పం ఎస్టీ కాలనీలో రూ.17.9 లక్షలతో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ట్యాంకు నిర్మాణ పనులు నాణ్యతగా ఉండాలన్నారు. పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు తాగునీటి వసతిని కల్పించాలన్నారు. జలజీవన్ మిషన్ కింద మండలానికి మొదటి దశలో 31 ట్యాంకులు మంజూరైనట్లు చెప్పారు. జక్కిదొన, వెదురుకుప్పం గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణం పూర్తి అయినట్లు తెలిపారు. అనంతరం వెదురుకుప్పంలో పూర్తయిన ట్యాంకు, పాతగుంటలో నిర్మాణ పనులను పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శైలజాకుమారి, ఏఈలు తిమ్మరాజు(వెదురుకుప్పం), గిరీష్‌కుమార్(కార్వేటినగరం), ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య పాల్గొన్నారు.



వెదురుకుప్పం ఎస్టీ కాలనీలో పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ నాగజ్యోతి